"ఇప్పుడు మెషినరీని అర్జెంటుగా ఇంపోర్ట్ చేయాల్సిన అగత్యమేముంది" అడిగింది కృషి ఉపాధ్యాయగార్ని చూస్తూ . . . . అనారోగ్యంతో రోజురోజుకీ మరిన్ని సమస్యల్లో ఆయన కూరుకుపోవడం ఆమెకు ఇష్టం లేకనే ఆ మాటంది తప్ప ఫ్యాక్టరీ విస్తరణ ఆమెకు ఇష్టం లేక కాదు. "అంతకన్నా ఉన్న వనరుల్ని సద్వినియోగ పరుచుకునే ప్రొడక్టివిటీ గురించి ఆలోచించడం బెటరనుకుంటాను"

కృషి ఆర్గ్యుమెంట్ నచ్చలేదు ఉపాధ్యాయగారికి - మారుతున్న పారిశ్రామిక ప్రపంచంలో ఆధునికత కూడా చాలా అవసరమన్నది ఆయన వుద్దేశ్యం. . . అందుకే పదికోట్లు ఖర్చుచేసి మెషిన్‌టూల్ ఫ్యాక్టరీకి యంత్రాల్ని దిగుమతి చేసుకోవాలని ఆలోచిస్తున్నారు.

ఉదయం ఎనిమిది గంటల సమయాన డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చుని యిద్దరూ చర్చించుకుంటుండగా వచ్చాడు విశ్వు అక్కడికి. అతడ్ని చౌదరి మనిషిగా భావించే కృషి విశ్వు సమక్షంలో యిదంతా చర్చించడం ఇష్టం లేక టాపిక్ మళ్ళించబోతుంటే ఉపాధ్యాయగారే కదిపాడు విషయాన్ని - నిజానికి వారి చర్చ అంతా అప్పటికి విన్న విశ్వు ఆయన చెబుతున్న దానిపై ఆసక్తిని ప్రదర్శించాడు. తెలివున్నవాడు చర్చని ఏ కోణంలో అయినా కొనసాగించగలడు అనటానికి ఉదాహరణ విశ్వు చెప్పిన జవాబు ఇక్కడ విశ్వు లక్ష్యం ఉపాధ్యాయగార్ని సమర్థించడమే. . . . "వ్యాపారంలో ఎక్కువగా డబ్బు సంపాదించడమెలా అని ఓ సగటు వ్యాపారవేత్తని ప్రశ్నిస్తే అతడిచ్చే జవాబు కార్మికులకి తక్కువ డబ్బు చెల్లించి ఎక్కువ పని చేయించుకోవడం అని! కాని వ్యాపారం చేసేది మనకోసం కాదు వినియోగదారుడి కోసం అని ఆలోచించే ఆధునిక భావాలు గల వ్యాపారవేత్త తన ఘన విజయానికి ప్రాతిపదికలా ఫ్యాక్టరీని మోడర్‌నైజ్ చేయాలని ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో కొత్త యంత్రాలని దిగుమతి చేస్తాడు. . . కార్మికుల తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తి చేసే వినూత్నమైన పద్ధతులకి అనుగుణంగా అలా దిగుమతి చేసి అటు తను ఎక్కువ లాభాల్ని ఆర్జించడమేగాక వినియోగదారుల్నీ సంతృప్తి పరుస్తాడు తక్కువ ధరలకి సరుకుల్ని అమ్ముతూ. . ."

"మీరు చెప్పేది థియరీ" అంది కృషి రోషంగా.

"నేను చెప్పిన థియరీ ప్రాక్టికల్‌గా నిరూపించబడింది మేడమ్. ఆరు వందల రూపాయలకి కెమిస్టుగా ఉద్యోగం చేసిన కార్సన్‌భాయ్ పటేల్ యీ రోజు వందల కోట్ల రూపాయల టర్నోవర్ గల 'నిర్మ' వాషింగ్ పౌడర్‌ని మార్కెట్ చేస్తున్నది అదే థియరీపై . . . అటు బిర్లాలకి ఇటు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన హిందుస్తాన్ లీవర్‌కి ప్రత్యర్థిగా నిలబడ్డ పటేల్‌కి 'నిర్మా' పేకట్‌పై వస్తున్న లాభం చాలా తక్కువ. కాని ఎక్కువ ఉత్పత్తి చేస్తూ ఎక్కువ లాభాల్ని పొందగలుగుతున్నాడు. ఈ రోజు అతడి వ్యక్తిగత ఆస్తులే సుమారు వందకోట్ల దాకా వున్నాయి. అంటే ఆధునికమైన పద్ధతులు ఆ పద్ధతులకి అతడుపయోగించే యంత్రపరికరాలే"

అభినందనగా చూశారు ఉపాధ్యాయగారు. విశ్వు ఓ వ్యక్తిగా కాక ఓ నిఘంటువులా అనిపించింది.

“అలాగే బారన మార్సెల్ బిక్ కూడా తొలిసారి బాల్ పాయింట్ పెన్నుని తయారుచేసి అతడు మార్కెట్‌లో విడుదల చేసినప్పుడు ఒక్కో పెన్ను మీద అతడి లాభం 00666 సెంట్సు మాత్రమే. అయినా యంత్రాలతో ఫ్యాక్టరీని ఆధునీకరించాడు. సాలీనా కోటి డాలర్ల లాభాన్ని సంపాదిస్తున్నాడు. సో - ఎక్కువలాభాలు కావాలీ అంటే నాణ్యతగల ఉత్పత్తి ఎక్కువ కావాలి. ఆ నాణ్యతకీ ఉత్పాదకతకీ కొత్త యంత్రాలూ వుండాలి.”

తెలిసిన స్టేటిస్టిక్స్‌ని మాటల గారడితో మిశ్రమం చేసి అద్భుతంగా స్కోర్ చేస్తున్న విశ్నుని ఓడించాలనుకుంది కృషి. “అంటే కార్మికుల మోటివేషన్‌తో జరిగే ఉత్పాదకత కన్నా కొత్త యంత్రాలు మోడర్నైజేషన్‌తోనే ఎక్కువ ఉత్పత్తి సాధ్యమంటారు.”

“మీరు నా మాటల్ని సరిగా అర్థం చేసుకోలేదనుకుంటాను మిస్ కృషి. . .మీకు యింకా స్పష్టంగా అర్థం కావాలీ అంటే. . .” ఆమెది తనను అర్థం చేసుకోగలిగే స్థాయికాదన్న భావాన్ని ఒడుపుగా వ్యక్తం చేశాడు విశ్ను. “ఫుట్‌పాత్ మీద పళ్ళమ్ముకునే వ్యాపారి కొడుకూ పళ్ళమ్ముకునే బ్రతకటానికి కారణం వ్యాపారంలో మెళకువ తెలీక అనే అంటే మీరు అంగీకరించాలి. . .పళ్ళను చూసి ధర ఎక్కువగా వుందని మనం అంటే నీ మొహానికి పళ్ళెప్పుడైనా కొన్నావా అని ఎద్దేవా చేస్తాడు. అందుకే ఆ స్థాయిని దాటి ఎదగడు. కాని ఓ అంగడిలో చిన్న టీ కొట్టు నడిపిన కృష్ణమూర్తి ఆ తర్వాత దేశ విదేశాలలో ఫుడ్‌లేండ్స్ హోటళ్ళను ప్రారంభించాడు. . అతడి వ్యాపారంలో ఎదుగుదలకి కారణమైంది యంత్రం కాదు. . .యంత్రంలా పనిచేయగల సహనం, ఆధునికంగా ఆలోచించగల మేధస్సు. . . అంచేత ప్రతి వ్యాపారానికీ కార్మికుడు కావాలి. . . ఆ కార్మికుడికి మోటివేషనూ వుండాలి.”

“ఇంత తెలిసిన మీరు చౌదరి దగ్గరే ఎందుకు వుండలేకపోయారు. . .” అసంకల్పితంగా అనేసింది కృషి.

ఒడిలో బాంబుపడ్డట్టు అధిరిపడ్డాడు విశ్ను . . . కృషి యింత సూటిగా యిలాంటి సమయంలో చౌదరి రిఫరెన్స్ తీసుకు వస్తుందని వూహించలేక పోయాడు.

ఉపాధ్యాయగారు అప్పటికే ఓ బద్ధ శత్రువుని చూస్తున్నట్టు విస్మయంగా అడిగారు “నువ్వు చౌదరి మనిషివా”

విశ్ను జవాబు చెప్పలేకపోయాడు.

“యస్ గ్రాండ్ పా.... విశ్వనాథ్ ముందునుంచీ రామనాథచౌదరికి చాలా చాలా ఆత్మీయుడు.”

అక్కడ గాలిగడ్డ కట్టుకుపోయింది.

“చాలా శ్రమపడి నేను చౌదరి మనిషినని తెలుసుకున్న మీ పరిశోధనకి నా జోహార్లు మిస్ కృషి” సీరియస్‌గా అన్నాడు విశ్ను కృషిని చూస్తూ. “ఇంతకన్నా మీ మనుషులు కానిదెవరో తెలుసుకోటానికి మీ శక్తిని వినియోగించివుంటే మరింత ఆనందించేవాడ్ని.”

ఉద్రేకాన్ని నిభాయించుకోటానికి చాలా శ్రమ పడాల్సి వచ్చింది.

"నేను వెళ్ళడమే మీరు కోరే విషయమైతే వెళ్ళిపోతాను. కాని వెళ్లేముందు... "

"చెప్పు" అర్థోక్తిగా అన్నారు ఉపాధ్యాయ.

"నిన్న భారత రక్షణశాఖకి మీరో టెండర్ పంపే ఏర్పాట్లు చేసారు కదూ"

ఉపాధ్యాయ మొహంలో రంగులు మారేయి.

"చాలా రహస్యంగా జరిగిన సమావేశంలో మీరు సప్లై చేయాల్సిన మెషిన్ రేట్సుని ఫైనలైజ్ చేశారు. . . "

కృషి సైతం అవాక్కయి చూస్తుంది.

"అందులో మీరు స్పెషల్ పర్పస్ మెషిన్‌కి కోట్ చేసిన ధర డెబ్బై లక్షల ముప్పై రెండు వేల రూపాయలు. . . మౌంటింగ్‌కి అరవై ఏడు వేలు - ట్రాన్స్‌పోర్టేషన్‌కి లక్షా రెండు వేల ఏడు రూపాయలు విడి విడిగా కోట్ చేశారు - అవునా - "

ఉపాధ్యాయ నిశ్చేష్టుడై చూస్తున్నారు కోట్ల ఖరీదు చేసే కొటేషన్‌కి సంబంధించి చాలా గోప్యంగా ప్రిపేర్ చేసిన వివరాల్ని తెలియచేస్తున్నాడు విశ్వ ఒక్క అంకె కూడా తప్పుకాకుండా-

"ఒకవేళ నేను చౌదరి మనిషినే అయి వుంటే మీ పరిధి నుంచి బయటికి వెళ్ళిన ఈ రహస్యం గురించి యిప్పుడు మీకు చెప్పాల్సిన అగత్యం నాకు లేదు చెబితే నాకు ఒరిగేది వుండదు."

ఉపాధ్యాయగారిపై తాత్కాలికమైన అస్త్రాన్ని సంధిస్తున్నాడు విశ్వ. అతడి జేబులో వున్న జిరాక్స్ కాపీ చూపించకుండా కొటేషన్ అంతా చెప్పేసాడు తప్పనిసరి పరిస్థితుల్లో.

"నిజానికి ఈ ఇన్‌ఫర్మేషన్‌తో నేను లక్షలు సంపాధించగలను కాని నా లక్ష్యం లక్షలు కాదు - మీ విజిలెన్స్‌లోని లోపం వలన మీకెంత నష్టం జరుగుతున్నదీ మీకు తెలియచెప్పడం.

"ఒకవేళ మీరు - " కృషి ఇంకా షాక్‌లోనే వుండటాన్ని గమనిస్తూ చెప్పాడు విశ్వ "అందరు ఆడపిల్లల్లా మనసుతో కాక మెదడుతో ఆలోచించి వుంటే నేను చౌదరి అనే మీ ప్రత్యర్థితో కొద్దిపాటి సాహచర్యాన్ని మెయిన్‌టెయిన్ చేయడంలో ఉద్దేశం మీకు అర్థమై వుండేది. ఎనీహౌ - నేనేమిటీ అన్నది మీరు ఇప్పటికైనా తెలుసుకుంటే చాలు సంతోషంగా వెళ్ళిపోతాను."

ఇక బయలుదేరేవాడే - అప్పుడు జోక్యం చేసుకున్నారు ఉపాధ్యాయ. . . "ఆగు"

అనడమే కాదు ఆప్యాయంగా విశ్వ భుజంపై చేయి చేశారు. . . అది అనితరసాధ్యమైన పరిశోధనే అనిపించిందో లేక తన సామ్రాజ్యాన్ని కాపాడటానికి విశ్వ అనే ఓ యువకుడు నిస్వార్థంగా తీసుకున్న శ్రద్ధగా కనిపించిందో మరి ఉద్వేగ్నంగా అన్నారాయన "నువ్వు వెళ్ళాల్సిన అవసరం లేదు విశ్వనాథ్ ప్యాక్టరీ విజిలెన్స్ సెల్ తెలుసుకోలేని ఓ నిజాన్ని నాకు తెలియచేసి నాకు కనువిప్పు కలిగించడమేగాక నా అడ్మినిస్ట్రేషన్ లోపాల్ని ఎత్తి చూపించి నీ నిజాయితీని కూడా నిరూపించుకున్నావ్. చెప్పు - ఈ విషయాన్ని ఎలా తెలుసుకోగలిగావు."

"క్షమించడి ఉపాధ్యాయగారూ. అది నేను చెప్పలేను."

"ఈ వివరాలు బయటికి ఎలా వెళ్ళాయి" కంపించి పోతున్నారాయన.

"అది తెలుసుకోవాల్సింది కూడా మీరే" మరింత రెచ్చగొడుతున్నట్టుగా అన్నాడు విశ్శు.

కృషి ఆవేశంగా అంది "ఇంత చెప్పిన మీరు అది కూడా తెలియచేయొచ్చుగా."

"నన్ను నిలదీసేకన్నా ఛాన్సెస్ గురించి మీరు ఆలోచిస్తే బెటర్. నిన్న మీ సమావేశంలో ఎవరెవరు పార్టిసిపేట్ చేశారు. అందులో ఎవరికి లీక్ చేసే అవసరం వుందీ లాంటి ప్రోబబులిటీస్."

"మిస్టర్ విశ్వనాథ్" విశ్శు గొంతులోని ఎగతాళిని భరించలేనట్టుగా అంది కృషి. "మీరెలా తెలుసుకున్నారో అది చెబితే ఈ రహస్యం బయటికెలా వెళ్ళిందో మేం ఇన్వెస్టిగేట్ చేస్తాం"

"మీ అమాయకత్వానికి బాధపడుతున్నాను మిస్ కృషి" మరింత వ్యంగ్యంగా అన్నాడు. "క్షణం పాటు ఆ వివరాలున్న డాక్యుమెంట్‌ని దొంగతనం చేసింది నేనే అనుకుందాం. . . అప్పుడు ఎలా దొంగతనం చేశావని నన్నడగడం కాదు మీరు చేయాల్సింది. . . నాకు అలాంటి బాధ ఛాన్సిచ్చిన మీ సెక్యూరిటీ లోపాల గురించి ఆలోచించాలి - మీ వాళ్ళూ అనుకుంటున్న మీ మనుషుల్లోని నిజాయితీ గురించి ఆలోచించాలి."

అర నిముషం మౌనం తర్వాత అన్నారు ఉపాధ్యాయ "నిన్న టెండర్‌కి సంబంధించిన చర్చలో పార్టిసిపేట్ చేసింది ముగ్గురం. నేను, కృషి, ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు - చర్చ తర్వాత ఫైనల్ స్టేట్‌మెంట్‌ని జియం కిచ్చాను పంపే ఏర్పాట్లు చేయమని - " ఈ విషయం చెబుతూ సైతం చాలా అసహనంతో నలిగిపోయారాయన. తన స్థాయి వ్యక్తికి సంజాయిషీలా మాట్లాడటం అనూహ్యమైన విషయం. "ఎలా - " గొణుగుతున్నట్టుగా అన్నారాయన "ఎలా తెలిసింది నీకీ విషయం"

"మీరు నమ్మే వ్యక్తులు అంతా మీరు నమ్మదగ్గవాళ్ళు కారు ఉపాధ్యాయగారు. . . " కృషి వేపు చూశాడు విశ్శు. ఆమెకు చురుక్కుమనిపించేట్టుగా - "పైగా ఫ్యాక్టరీ విజిలెన్స్ అన్నది ఎంత ముఖ్యమైన విభాగమో మీకు చెప్పేటంత మేధావిని కాను నేను-"

తను మాత్రం నమ్మదగ్గ వ్యక్తినంటూ పరోక్షంగా విశ్శు వ్యక్తం చేస్తుంటే తను పడుతున్న శ్రమని ఎగతాళి చేస్తున్నట్టుగా వుంది కృషికి.

"మీ అనుభవం అపారమైనది. మీ దీక్ష అనితర సాధ్యమైనది - కాని. . ." ఉపాధ్యాయగారి అహాన్ని ఒడుపుగా రెచ్చగొడుతూ చెప్పుకుపోయాడు విశ్శు. "మీరు అనారోగ్యంతో వున్న వ్యక్తి - ఆ విషయం మీరు అంగీకరించరు. అంగీకరించక పోయినా ఇది నిజం. కాబట్టే కృషిలాంటి సమర్ధురాలైన వ్యక్తికి మీ కాన్ఫిడెన్స్‌లోకి తీసుకోవాల్సి వచ్చింది. ఇలా అంటున్నందుకు నన్ను మీరు కోపగించుకున్నా నేను బాధపడను సర్. కాని ఆడపిల్లలకి

జనరల్ మేనేజర్ బయటికి చేరేసిన విషయాన్ని లాఘవంగా తెలుసుకోగలిగేది."

"వ్వాట్" అదిరిపడినట్టుగా చూశాడు. . ."ఇది చేసింది సుబ్బారాయుడా" ఓ దశాబ్దం కాలం నుంచి అతడిపై పెంచుకున్న నమ్మకం సడలిపోతుంటే ఆందోళనగా అన్నారు "ఐ కాంట్ ఇమేజినిట్. . . "

"ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలుంటాయి. . .ఆ బలహీనత డబ్బు కావచ్చు... ఆడది కావచ్చు. . . . అధికారం కావచ్చు. . . "

"సుబ్బారాయుడికి డబ్బుతోనూ అవసరం లేదు"

"కాని అతడికున్న బలహీనత ఆడది - ఆ ఆడదానికి వున్న బలహీనత డబ్బు - అందుకే డబ్బు తీసుకున్న ఓ ఆడది మీ టెండరు వ్యవహారాన్ని తెలుసుకుంటానని మీ ప్రత్యర్థులకి హామీ ఇచ్చింది. మీ జనరల్ మేనేజర్ని తన దగ్గరకు రప్పించుకుని ఈ వివరాలన్నీ సంపాదించగలిగింది."

విశ్వ చెప్పింది పూర్తికాక ముందే అంది కృషి "మీరు ఇదంతా అలాంటి ఆడదానినుంచి తెలుసుకోగలిగారన్నమాట"

"ఎస్" వెంటనే అన్నాడు విశ్వ "మీరు కరెక్టుగా గెస్ చేశారు ఐతే నా బలహీనత ఆడది కాదు. అలాంటి వ్యవహారాలు సహించలేకపోవడం - "

"మిమ్మల్ని నమ్మేట్టు చేసుకోగలగడం కూడా అనుకుంటాను "ఉక్రోషంగా అంది కృషి.

కృషీ సాధికారంగా నిలధీశారు ఉపాధ్యాయ. "ఇక్కడ నువ్వు ప్రశ్నించాల్సింది విశ్వనాథ్ని కాదు - మన అడ్మినిస్ట్రేటివ్ లాప్సెస్ని"

కృషిని విశ్వ విషయంలో ఇలా మందలించడం తొలిసారి. . . ఇక్కడ కూడా తను ఓడిపోయినందుకు ఆమె బాధపడుతుందో లేక గ్రాండ్పాకి మరింత దగ్గరకావాలని విశ్వ ప్రదర్శించిన తెలివికే ఆశ్చర్యపోతుందో ఆమెకి తెలీదు.

"థేంక్స్ సర్. . ." వినయంగా అన్నాడు విశ్వ. "నేనేమిటీ అన్నది మీరైనా తెలుసుకోగలిగారు. . . అందుకు కృతజ్ఞుడ్ని."

మరింత నిజాయితీని ప్రదర్శించిన విశ్వని చూస్తూ అర నిముషం తర్వాత అన్నారు ఉపాధ్యాయ.

"ఇక నువ్వు నువ్వేమిటీ అన్నది నిరూపించుకోవాల్సిన అగత్యం లేదు విశ్వ . . ." తన నమ్మకాన్ని ఇంకెవరూ సడలించలేరన్నంత దృఢంగా చెప్పుకుపోయారాయన. "ఈ రోజు నుంచీ నువ్వు మాకు మరింత ఆత్మీయుడవైన వ్యక్తివి. . .యస్ విశ్వనాథ్. . . నిస్వార్థంగా నన్ను కాపాడిన నువ్వు ఇప్పుడు నా సామ్రాజ్యాన్ని కాపాడే ప్రయత్నం చేశావు. అందుకు అభినందిస్తున్నాను. . . ఇక ముందూ నీ సహకారం కావాలని కోరుకుంటున్నాను."

తన పథకంలో మెదటి అంకం పూర్తయినట్టుగా విశ్వ పెదవులు ఆనందంగా నిమురుకున్నాయి.

కృషి నివ్వెరపోతూంది విశ్నుని చూస్తూ. . .

అసాధారణంగా విస్తరించిపోతూన్న విశ్ను తను అంత సులభంగా కదిలించలేని స్థాయికి చేరుకుంటున్నాడు.

ఆ తర్వాత జనరల్ మేనేజర్‌పై గ్రాండ్‌పా ఎలాంటి చర్య తీసుకుంటాడూ అన్నది కాదు ఆమె ఆలోచిస్తున్నది. ఇంత లోతుగా పాతుకుపోతున్న విశ్ను మూలంగా రేపేం జరగబోతుంది అన్న విషయం గురించి.